

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు
5
శనివారం 14 డిసెంబరు 2024

దగాపడ్డ మిర్చి రైతు



ఈ రైతు పేరు గోపాల్. కర్నూలు మండలం రేమట గ్రామం. ఈ రైతు కర్నూలు మార్కెట్ యార్డుకు 6 బస్తాల ఎండుమిర్చిని అమ్మకానికి తీసుకువచ్చాడు. తూకాలు వేసే సమయంలో అధికారులు పత్తా లేకుండా పోయారనీ, తూకం కూడా తక్కువ చూపి కొంత మిర్చిని కొట్టేశారనీ, కమిషన్ 4 నుంచి 6 శాతం వ్యాపారి డిమాండ్ చేశారనీ గోపాల్ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇది ఈ రైతు అనుభవమే కాదు. ఎండుమిర్చిని అమ్మకానికి తెచ్చిన ఉమ్మడి జిల్లా రైతులు, తెలంగాణ రాష్ట్రంలోని అలంపూరు తదితర ప్రాంతాల రైతులు కూడా దగా పడుతున్నారు. గుంటూరు మిర్చి యార్డు తర్వాత కర్నూలు మిర్చి యార్డుకు వేలాది మంది రైతులు ఎండుమిర్చిని అమ్మకానికి తీసుకువస్తారు. అధికారుల నిర్లక్ష్యం వహించడం, వ్యాపారులతో కుమ్మక్కు కావడం వల్లనే తమకు గిట్టుబాటు ధర అందడం లేదని, ఇష్టారాజ్యంగా వ్యాపారులు తమను దోచేస్తున్నారనీ మిర్చి రైతులంతా ఆందోళన చెందుతున్నారు.



- మార్కెట్ యార్డులో ముంచేస్తున్న వ్యాపారులు
- 40 మందికి లైసెన్సులు.. 10 మందే కొనుగోళ్లు
- భారీ మొత్తంలో జీరో వ్యాపారం
- ప్రకృతి వైపరీత్యాలకు మించిన నష్టం
- 4 నుంచి 6 శాతం కమిషన్ ముక్కు పిండి వసూలు
- కార్యాలయంలో వ్యాపారులతో పిచ్చాపాటికే అధికారులు పరిమితం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో దాదాపు 50వేల ఎకరాల్లో ఎండుమిర్చిని రైతులు సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి రైతులు ప్రకృతి వైపరీత్యాలతో పాటు వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలు, తుఫాన్ కారణంగా మిర్చి రైతులకు భారీ నష్టం జరిగి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పరిస్థితులు అనుకూలించి వుంటే ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. అయితే.. నల్లి, తామర తదితర తెగుళల వల్ల, కీటకాల వల్ల మిర్చి పంటకు భారీగా నష్టం జరిగింది. ఎకరాకు కేవలం 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే అందింది. కనీసం చేతికందిన కాస్తో.. కూస్తో దిగుబడినైనా గిట్టుబాటు ధరకు అమ్ముకుందామనే ఆశతో రైతులు గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ్లకుండా రవాణా ఖర్చులు కలిసి వస్తాయనే ఆశతో కర్నూలు మిర్చి యార్డుకు అమ్మకానికి తెస్తున్నారు. అయితే.. వ్యాపారులు వారిని దగా చేస్తున్నారు. వారితో చేతులు కలుపుతున్న అధికారుల కారణంగా రైతులు నిండా మునిగిపోతున్నారు. ఒక ఎకరా మిర్చి సాగుకు దాదాపు రూ.1లక్ష పైగానే ఖర్చు పెడుతున్నామని, అయితే.. యార్డులో భారీగా నష్టాలపాలవుతున్నట్లు రైతులు తెలిపారు. ప్రకృతి విపత్తు కంటే యార్డులోనే ఎక్కువ నష్టపోతున్నామని అంటున్నారు.


40 మందికి గాను పది మంది మాత్రమే కొనుగోళ్లు

కర్నూలు మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లు జరపడానికి 40 మంది లైసెన్సులు తీసుకున్నారు. అయితే.. అందరూ కొనుగోళ్ల కోసం పోటీ పడితే.. రైతులకు ధర ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో వ్యాపారులు కూడగట్టుకుని కేవలం పది మంది మాత్రమే మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. ఆ పది మంది కొనుగోలు చేసిన మిర్చినే టెండరులో పాల్గొనని వ్యాపారులు కూడా సిండికేట్ అయ్యి వివిధ ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నట్లు సమాచారం. లైసెన్సులు తీసుకున్న 40 మంది చేత టెండరు వేసేందుకు అధికారులు ఏ మాత్రం శ్రద్ధ తీసుకోకపోవడం దారుణమని పలువురు అంటున్నారు. ఈ వ్యవహారంపై ఎన్నోసార్లు మార్కెట్ కమిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా లైసెన్సు తీసుకున్న వ్యాపారుల అందరి చేత కొనుగోళ్లు చేయించాలని, లేకపోతే తాము నష్టపోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెద్ద ఎత్తున జీరో వ్యాపారం

కర్నూలు మార్కెట్ యార్డులో ఎండుమిర్చి వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతోంది. గుంటూరు తర్వాత ఎండుమిర్చి అమ్మకాలు కర్నూలులోనే జరుగుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్క కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులోనే మిర్చి కొనుగోలు జరుగుతుండటంపై తమకు గిట్టుబాటు ధర అందుతుందని రైతులు ఆశించారు. అయితే.. వ్యాపారులు అధికారుల నిర్లక్ష్యాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని గ్రామాలకే వెళ్లి పెద్ద ఎత్తున రైతులతో కొనుగోలు చేసి హైదరాబాద్, మద్రాసు, బళ్లారి తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. జీరో వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతున్నందు వల్ల మార్కెటింగ్ శాఖకు సెస్సు రూపంలో రావాల్సిన దాదాపు రూ.కోటి ఆదాయానికి గండిపడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఏటా 60వేల హెక్టార్లలో మిర్చిని సాగు చేస్తున్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి క్వింటం ఎండు మిర్చికి దాదాపు రూ.20 నుంచి రూ.30 వేల దాకా రైతుకు ఆదాయం లభించింది. దీని వల్ల మార్కెటింగ్ శాఖకు పెద్ద ఎత్తున సెస్సు రూపంలో ఆదాయం వచ్చింది. దీని వల్ల పెద్ద ఎత్తున జీరో వ్యాపారం జరుగుతుండటంతో సెస్సు వసూళ్లకు గండి పడే అవకాశం కనిపిస్తోంది.

మిగతా 7లో....



ఆత్మహత్య చేసుకున్న శ్రీహర్ష (ఫైల్)

ప్రియురాలు పట్టించుకోవడం లేదని...
డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య
7

అప్పుల బాధతో రైతు బలవన్మరణం
7

మద్దతు ధరతో వరి కొనండి: జేసీ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతు నష్టపోకుండా మద్దతు ధరతో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ రైస్‌మిల్లర్లు, ట్రేడర్లను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వరి ధాన్యం మద్దతు ధరతో కొనుగోలు అంశంపై రైస్‌మిల్లర్లు, ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సంవత్సరంలో జిల్లాలో వరిపంట దిగుబడి అధికంగా వచ్చిందన్నారు. జిల్లాలో ఎన్‌డీఎల్‌ఆర్7, బిపిటి 5204 వెరైటీ రకాల వరి ధాన్యానికి మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో మంచి ధర వుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత సీజన్లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంట దిగుబడి అధికంగా రావడం వలన కొంత మేర ధరలు తగ్గాయన్నారు. కొన్నిచోట్ల వరి ధాన్యంలో తేమ శాతం సాకుగా చూపి రైతుల నుండి ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జేసీ విష్ణుచరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకట్రాముడు, డీఎం సివిల్‌సప్లై రాజునాయక్, రైస్‌మిల్లర్ల ట్రేడర్లు పాల్గొన్నారు.

అన్ని పంట దిగుబడులను ప్రభుత్వమే కొనాలి

- కదం తొక్కిన రైతులు



ర్యాలీ చేస్తున్న వైసీపీ నాయకులు


నంద్యాల కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ప్రభుత్వమే అన్ని రకాల పంట దిగుబడులకు గిట్టుబాటు ధరలు ఇచ్చి కొనాలని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధ్యక్షతన రైతులతో శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ చేసి జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి బుగ్గన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని కోరారు. మరో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులు సాగు చేసిన అన్ని పంట దిగబడులకు గిట్టుబాటు ధరలను కల్పించి ప్రభుత్వమే కొనాలని కోరారు. విత్తనాలను, ఎరువులను రైతులకు సమృద్ధిగా అందించి సబ్సిడీ ఇవ్వాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేయాలని, రైతులకు ఏడాదికి 20వేలు ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, నందికొట్కూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. సుధీర్, జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధికి అంబాసిడర్ చంద్రబాబు : మంత్రి బీసీ

బనగానపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధికి అంబాసిడర్ అని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితోనే ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి బీసీ తెలిపారు. నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు బనగానపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న బీటీ రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించి తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి బీసీ మాట్లాడుతూ సంక్రాంతినాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రోడ్ల మరమ్మతు పనులను ఆరు జిల్లాల్లో పర్యటించి తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు మెరుగైన రహదారులు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. రూ.861 కోట్లతో రోడ్ల మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రకాశం జిల్లాలో రూ.21 కోట్లతో 1,313 కిలోమీటర్ల రహదారుల మరమ్మతులు పూర్తి చేశామన్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గత 5ఏళ్ళ వైసీపీ పాలనలో ప్రభుత్వం రోడ్లను రెన్యువల్ చేయకపోవడంతో నేడు అదనంగా ప్రభుత్వంపై రూ.15వేల కోట్ల భారం పడిందన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడానికి చంద్రబాబు నేతృత్వంలో పని చేస్తున్నామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.

మహానందిలో మెట్రో రైల్వే జీఎం పూజలు



మహానందిలో పూజలు నిర్వహించి వస్తున్న మెట్రో రైల్వే జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మహానంది, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కలకత్తా మెట్రో రైల్వే జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాత్రి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం వద్ద వీరికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో అభిషేకార్చనలను నిర్వహించారు. కల్యాణ మంటపంలో వేదపండితులు వీరిని శాల్వాతో సన్మానించి, ప్రసాదాలు అందజేసారు. వీరి వెంట రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుని హుండీ ఆదాయం రూ.59 లక్షలు

మహానంది క్షేత్రంలో శుక్రవారం హుండీ లెక్కించగా దేవస్థానానికి రూ. 59,49,355 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రధాన ఆలయాల్లోని హుండీలతో పాటు అన్నదానం, గోశాల హుండీల్లో భక్తులు 43 రోజుల పాటు సమర్పించిన కానుకలను ఆలయ ప్రాంగణంలోని అభిషేకమంటపంలో సిబ్బంది లెక్కించారు. ఇందులో ప్రధాన ఆలయాల్లోని హుండీల ద్వారా రూ.57,94,430, అన్న ప్రసాదం హుండీ ద్వారా రూ.12,68,29, గోసంరక్షణ హుండీ ద్వారా రూ.28,096 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎర్రమల్ల మధు, ఆలయ సిబ్బందితో పాటు వివిధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నీళ్లు పారని కాలువలకు
సాగునీటి ఎన్నికలు..!


తొమ్మిదేళ్ల తర్వాత సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ)కు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తోంది. కర్నూలు జిల్లాలో 123 డబ్ల్యూయూఏలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. సాయంత్రం నూతన పాలకవర్గం కొలుదీరనుంది. జిల్లా జలనవరులు, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పదవుల కోసం ఆరాటపడుతున్న టీడీపీ కూటమి నాయకులు ఓట్ల కోసం రైతుల ఇళ్ల వద్దకు పరుగులు పడుతున్నారు. శనివారం జరిగే ఎన్నికల్లో మాకే మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పుడు ఏ ఎన్నికలు ఉన్నాయి..? అంటూ రైతులు ప్రశ్నిస్తే.. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు అంటూ నాయకుల సమాధానం. పాతికేళ్లుగా సాగునీరే కాలువల్లో పారలేదు. నీళ్లే లేని కాలువలకు నీటి ఎన్నికలా..? అంటూ అన్నదాతలు ముక్కున వేలేసుకుంటున్నారు. పాతికేళ్ల యువరైతులైతే మా పొలాలకు సాగునీరు వచ్చేదా..? నీళ్లు పారని కాలువలకు సాగునీటి ఎన్నికలా..? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో రూ.వందల కోట్ల విలువైన ఎల్లెల్సీ కాలువ భూములు అన్యాక్రాంతం అయ్యాయి.

- పాతికేళ్లకు పైగా సాగునీరు అందని ఆయకట్టు
- రూ.200 కోట్లకు పైగా విలువైన భూములు అన్యాక్రాంతం
- నేడు జిల్లాలో డబ్ల్యూయూఏలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఎన్నికల నిర్వహణకు కర్నూలు జిల్లాకు రూ.20 లక్షల మంజూరు



కర్నూలు జిల్లాలో వివిధ సాగునీటి సంఘాల ఎన్నికల కేంద్రాలకు పంపేందుకు సామాగ్రి సిద్ధం చేస్తున్న ఏఈఈ రంగన్న, సిబ్బంది

కర్నూలు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ కాలువలు సహా పంట కాలువలు 1955లో నిర్మాణం చేశారు. తుంగభద్ర జలాశయం నుంచి ఎల్లెల్సీ నీటి వాటా 24 టీఎంసీలు. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు, రబీలో 1,07,615 ఎకరాలు కలిపి 1,51,134 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఆదోని మండలం హనవాళ్ల వద్ద టీబీపీ బోర్డు సరిహద్దు 250 కిలోమీటర్ల నుంచి కోడుమూరు సమీపంలో 324 కిలోమీటర్ల వరకు 74 కిలోమీటర్లు టీబీపీ ఎల్లెల్సీ, అక్కడి నుంచి 0/0 నుంచి 49 కిలోమీటర్లు వరకు అంటే.. కల్లూరు సమీపంలో వక్కెర వాగు వరకు 49 కి.మీలు టీబీపీ ఎల్లెల్సీ కర్నూలు బ్రాంచి కాలువ (కేబీసీ) ఉంది. ఈ కాలువ పరిధిలో సుమారుగా 51,900 ఎకరాలకు ఆయకట్టు ఉంది. పాతికేళ్ల క్రితం వెనక్కి వెళ్తే తుంగభద్ర జలాలు వచ్చేవని పెద్దపాడు గ్రామానికి చెందిన 75 ఏళ్ల ఓ రైతు పేర్కొన్నారు. కర్ణాటక జల చౌర్యం, ఎగువన అక్రమ ఆయకట్టు సాగు పెరగడం, రాజకీయ జోక్యం, ఇంజనీర్ల నిర్లక్ష్యం వెరసి కర్నూలు రూరల్, గూడూరు మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందని ద్రాక్షగా మారాయి. రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే ఆయకట్టు. వానొస్తే తప్పా పంటలు పండని దైన్యస్థితికి చేరింది. చివరి ఆయకట్టు గ్రామాలు రైతులు ఏనాడో సాగునీటిని మరిచిపోయారు.



ఆదోని తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ కార్యాలయం

- **ఆ కాలువలకు పాలకవర్గాలా..?**

రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఎల్లెల్సీ కాలువ పరిధిలో 58 డబ్ల్యూయూఏలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. డబ్ల్యూయూఏ టీసీ సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులను శనివారం రైతులు ఎన్నుకోవాలి. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆయకట్టు రైతులను గుర్తించి ఓటర్ల జాబితా తయారు చేశారు. గూడూరు మండలం కె.నాగులాపురం, కర్నూలు రూరల్ మండలం ఉల్చాల, మునగలపాడు, కల్లూరు మండలం పర్ల, పెద్దపాడు సాగునీటి వినియోగదారులు (డబ్ల్యూయూఏ) పరిధిలో 60 మంది టీసీ సభ్యులు, ఆ ఐదు డబ్ల్యూయూఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోబోతున్నారు. డబ్ల్యూయూఏ అధ్యక్షులు కర్నూలు -10 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాలి. ఆయా గ్రామాల ఆయకట్టుకు పాతికేళ్లకు పైగా సాగునీరు అందడం లేదు. 1980 నుంచి కాలువల్లో నీరు పాడం లేదని ఓ ఆయకట్టు రైతు వాపోయారు. రేమట, సింగవరం గ్రామాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. అయితే అడపాదడపా గురురాఘవేంద్ర లిఫ్టు ద్వారా నీటిని ఇస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తుండడంతో పదవులపై ఆసక్తి ఉన్న నాయకులు ఓటర్ల జాబితా పట్టుకొని ఇంటింటికి వెళ్లి శనివారం జరిగే నీటి సంఘాల ఎన్నికలకు రావాలని, తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. దశాబ్దాలు కాలంగా నీళ్లు పారని కాలువలకు ఎన్నికలా..? కొత్తగా ఎన్నికయ్యే పాలకవర్గాలు నీళ్లు తెప్పిస్తారా..? అది సాధ్యమయ్యే పనేనా..? అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.

- **కాలువ భూములు అన్యాక్రాంతం**

కర్నూలు నగరంలో స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారం జోరందుకోవడంతో నగర శివారులో ఉన్న కల్లూరు, పెద్దపాడు, ఉల్చాలా, మునగలపాడు గ్రామాల్లో వెంచర్లు వెలిశాయి. ఆయకట్టు కనుమరుగై రియల్ వెంచర్లు వెలిశాయి. టీబీపీ ఎల్లెల్సీ కర్నూలు బ్రాంచి కాలువ భూములు కూడా ఆక్రమణకు గురయ్యాయని టీబీపీ ఎల్లెల్సీ ఇంజనీరింగ్ అధికారి ఒకరు వాపోయారు. ఉల్చాల, పెద్దపాడు, కల్లూరు, మునగలపాడు, కర్నూలు ప్రాంతాల్లో దాదాపు వంద ఎకరాలకు పైగా కాలువ భూమి అన్యాక్రాంతమైంది. ప్రస్తుత బహిరంగ మార్కెట్ ప్రకారం ఆ భూముల విలువ దాదాపుగా రూ.200 కోట్లకు పైగా ఉంటుందని అధికారులే అంటున్నారు. పదేళ్ల క్రితం ఓ అధికారి కె.నాగులాపురం నుంచి కల్లూరు సమీపంలోని వక్కెరువాగు వరకు టీబీపీ ఎల్లెల్సీ కేబీసీ కాలువ భూములపై సర్వేకు శ్రీకారం చుడితే.. రాజకీయ నేతలు రంగంలోకి దిగి సర్వే జరగకుండా తొక్కిపెట్టారు.

మిగతా 6లో...



హర్డల్స్ రేస్‌లో చిరుత వేగం ప్రదర్శిస్తున్న నవాజ్

పరుగుల నవ యువకుడు

ఆదోని టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : ఆయనకు అరవైఏళ్లు. కానీ పరుగుల రారాజు. ఇరవై ఏళ్ల యువకుడిలా పరుగుల్లో పోటీపడి పతకాలు సాధిస్తారు. వదిలిన బాణంలా ఊహించని రీతిలో పరుగులు తీసి అబ్బురపరుస్తారు. ఆయనే పట్టణానికి చెంది ఖాజా బందే నవాజ్. రన్నింగ్ (హర్డల్స్)లో మన దేశంలోనే కాకుండా విదేశాలలో సైతం తన ప్రతిభను చాటుకున్నారు.

- 50కుపైగా రాష్ట్ర స్థాయిలో పతకాలు
- ఫిలిప్పైన్స్, స్వీడన్‌లలో ప్రతిభను చాటుకొన్న ధీరుడు
- చదివింది డిగ్రీ, వృత్తిరీత్యా ప్యాబ్రికేటర్



ఖాజా బందే నవాజ్ 20 సంవత్సరాలుగా క్రీడా జగత్తులో తన ప్రతిభను చాటుకుంటున్నారు. శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తరపున ఫుట్ బాల్‌తో పాటు రన్నింగ్ రేస్ పోటీలలో పాల్గొని అనేక జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలలో 50కుపైగా పతకాలు, మెమెంటోలు, ప్రశంసా పత్రాలు కైవసం చేసుకొన్నారు. 2022లో చెన్నైలో జరిగిన నేషనల్స్‌లో వంద మీటర్‌ల రన్నింగ్ రేస్‌లో బ్రాస్ మెడల్, 2023లో కలకత్తాలో జరిగిన నేషనల్స్‌లో వంద మీటర్ల రన్నింగ్ (హర్డల్స్)లో సిల్వర్ మెడల్, 400మీటర్ల రన్నింగ్ (హర్డల్స్)లో బ్రాస్ మెడల్ లభించింది. 2024లో పూణేలో జరిగిన నేషనల్స్‌లో 100మీటర్ల రన్నింగ్ రేస్ (హర్డల్స్)లో గోల్డ్ మెడల్, 300మీటర్ల రన్నింగ్ రేస్ (హర్డల్స్)లో బ్రాస్ మెడల్, 100మీటర్ల రన్నింగ్ రేస్‌లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకొన్నారు. ఇంటర్నేషనల్స్‌లో సైతం చాటుకొన్న ప్రతిభ ఈ వృద్ధ క్రీడాకారుడు విదేశాలలో సైతం తన మెరుపు వేగాన్ని ప్రదర్శించి పలువురి ప్రశంసలు పొందారు. 2023లో ఫిలిప్పైన్స్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీలలో 100మీటర్ల హర్డల్స్ రన్నింగ్ రేస్‌లో నాలుగవ స్థానం, 400మీటర్ల హర్డల్స్ రన్నింగ్ రేస్‌లో ఐదో స్థానం లభించింది. 2024లో స్వీడన్‌లో జరిగిన వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని అంటారు. ఖాజా బందే నవాజ్‌కు 100,400మీటర్ల హర్డల్స్ రన్నింగ్ రేస్‌లలో కూడా పాల్గొని తన సత్తాను ప్రదర్శించే అవకాశం లభించింది. ఇది తనకు మరిచిపోని అనుభవం అంటారు.

● చదివింది డిగ్రీ, వృత్తి రీత్యా ఫ్యాబ్రికేటర్

ఖాజా బందే నవాజ్ డిగ్రీ దాకా చదుకొని ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా ఫ్యాబ్రికేటర్ వృత్తిని ఎంచుకొని అందులో స్థిరపడ్డారు. చదువుకొనే రోజుల నుండి క్రీడలపై ఎక్కువ మక్కువ ఉండేదని, ఇంటర్నేషనల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలన్నదే తన ఆశయమని నవాజ్ అంటున్నారు.



స్త్రీ పురుషులు సమానం

● క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి సాయిగోపాల్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో స్త్రీ, పురుషులు సమాన పాత్ర పోషిస్తారని, బండికి రెండు చక్రాలాంటి వారని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలో మహిళా సాధికారిత శాఖ అధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు లైంగిక వేధింపులను నియంత్రించే చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే దాడులు చూస్తోంటే సమాజం అభివృద్ధి చెందిందా? అనే సందేహం కలుగుతోందని అన్నారు. ప్రముఖ న్యాయవాది తేజవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని, అప్పుడే అన్యాయాలను ఎదిరిస్తామని అన్నారు. ఈ సదస్సులో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డి ప్రసాదరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లమెంటరీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ స్పెషల్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. 1వ సంవత్సరం 120కి 63, రెండో సంవత్సరం 264కు 122, 3వ సంవత్సరానికి 519 మంది పరీక్షలు రాయగా 249 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షల రీవాల్యుయేషన్ కోసం ఈనెల 27 లోపు ఆయా కళాశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద తగిన రుసుం చెల్లించి రిజిస్టర్ చేసుకోవాలని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు.

టమోటా కొనుగోలుకు చర్యలు

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ టమోటా మార్కెట్‌లో రైతుల నుంచి టమోటా కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డుకు 42 టన్నులు వచ్చాయనీ, ఇందులో 13 టన్నులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేసి మచిలీపట్నం, గుంటూరు, కర్నూలులోని అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట, సీక్యాంపు రైతుబజార్లకు తరలించినట్లు తెలిపారు. ఇంత వరకు 34 టన్నుల టమోటాను రాష్ట్రంలో వివిధ రైతుబజార్లకు పంపిణీ చేశామన్నారు. పత్తికొండ టమోటా మార్కెట్‌లో టమోటా కిలో రూ.కనిష్ఠ ధర రూ.4కు కొనుగోలు చేయాలని వ్యాపారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా



డోన్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్

డోన్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీవో అధికారులు వాహనాల తనిఖీలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆరెంజ్ ట్రావెల్స్‌కు సంబంధించి ఏఆర్01జీ4158 బస్సులో 35 మంది ప్రయాణికులతో ఖమ్మం నుంచి బెంగుళూరు వెళ్తుండగా.. ఆర్టీవో క్రాంతి కుమార్ తనిఖీ చేశారు. ఎటువంటి రోడ్డు ట్యాక్స్ కట్టకపోవడంతో రూ. 4.43 లక్షలు జరిమానా విధించి ట్రావెల్ బస్సును డోన్ ఆర్టీసీ డిపోకు తరలించినట్లు ఆర్టీవో తెలిపారు. అలాగే పర్మిట్ లేని ఓవర్‌లోడు వాహనాలకు రూ.82వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● అధికారులకు మంత్రి బీసీ ఆదేశం



ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం బనగానపల్లెలోని టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వివిధ గ్రామాలనుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ఎన్‌డీఏ కూటమి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల పక్షాన నిలిచి వారి సమస్యలను సానుకూలంగా విని స్పందించాలన్నారు.

తహసీల్దార్ జీతం జప్తునకు కోర్టు ఆదేశం

కర్నూల లీగల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒక సివిల్ కేసులో కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన నంద్యాల జిల్లా క్రిష్ణగిరి తహసీల్దార్ జీతాన్ని జప్తు చేయాలని ఆదేశిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.మల్లేశ్వరి ఆదేశాలు జారీ చేశారు. వీఆర్వో ఎం.పెద్దమద్దిలేటి కర్నూలు చెందిన ఎం.తిరుపతయ్య నుంచి అప్పు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో కోర్టులో కేసు దాఖలైంది. దీనిపై కోర్టు వీఆర్వో జీతం జప్తు చేయాలని క్రిష్ణగిరి తహసీల్దార్‌కు 2020లో ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ ఉత్తర్వులను తహసీల్దార్ అమలు చేయలేదు. దీంతో కోర్టు తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయినా కూడా తహసీల్దార్ స్పందించకపోవడంతో అతని జీతాన్ని జప్తు చేయాలని ఆదేశిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ కేసును ఈ నెల 16కు వాయిదా వేసింది.

సాగునీటి ఎన్నికలు..!

(5వ పేజీ తరువాయి)



హోళగుందలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే జడ్పీ ఉన్నత పాఠశాల

నీళ్లు పారని కాలువలకు సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు పాలకవర్గం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యే నాయకులు కాలువ భూమి ఆక్రమణలపై దృష్టి సారించాలని, రూ.వందల కోట్ల విలువపై ప్రభుత్వ కాలువ భూములను కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించాలని, పక్కా భవనాలు నిర్మించి ఉంటే.. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ధర నిర్ణయించి ఖజానాకు రాబడి పెంచాలని పలువురు కోరుతున్నారు.

● ఎన్నికల నిర్వహణకు రూ.20 లక్షలు

కర్నూలు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో టీబీపీ ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువలతో పాటు మైనర్ ఇరిగేషన్ చెరువుల నిర్వహణ కోసం 123 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు శనివారం ఉదయం 8 గంటలకు ప్రక్రియ మొదలవుతుంది. మేజర్, మీడియం ప్రాజెక్టుల పరిధిలోని ఒక్కో డబ్ల్యూయూఏలో 12 మంది, మైనర్ ప్రాజెక్టు పరిధిలోని సంఘంలో ఆరుగురు టీసీ సభ్యులు ఉంటారు. జిల్లాలో 123 డబ్ల్యూయూఏల పరిధిలో 1,212 మంది టీసీ సభ్యులను నేడు ఎన్నుకుంటారు. మెజార్టీ రైతుల ఆమోదంలో ఎంపికైన టీసీ సభ్యులు సాయంత్రం 3 గంటల తరువాత సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆధ్వర్యంలో జలవనరులు, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. డబ్ల్యూయూఏ ఎన్నికల ఆథరైజ్డ్ అధికారికి ఫారం-1 నుంచి ఫారం-10 వరకు అవసరమైన సామగ్రి అందజేశారు. ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఒక్కో సాగునీటి సంఘం ఎన్నికకు దాదాపు రూ.15-16 వేలు ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే స్టేషనరీ, ప్రింటింగ్, ఓటర్ల జాబితా ప్రింటింగ్, ఇతర మెటీరియల్ కోసం దాదాపుగా రూ.18 లక్షలకు పైగా అధికారులు ఖర్చు చేశారు. అయితే.. ఆయా గ్రామాల్లో తెల్లారగానే నీటి సంఘాల ఎన్నికలు జరగునుండడంతో రాజకీయ వేడి రాజుకుంది. కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు రంగప్రవేశం చేసి ఏకగ్రీవం చేసుకోవడానికి ప్రయత్నాలు తీవ్రం చేశారు. అదే క్రమంలో పోటీ చేయడానికి వైసీపీ నాయకులు కూడా వ్యూహాలకు పదును పెట్టారు.

టీసీ సభ్యుడిగా పోటీకి అర్హతలు ఇవి..

- ఆయకట్టుదారుడై ఓటర్ల జాబితాలో పేరు ఉండాలి
- 2022 నాటికి నీటి తీరువా పన్ను పూర్తిగా చెల్లించినట్లు తహసీల్దారు జారీ చేసిన నోడ్యూ సర్టిఫికేట్ ఉండాలి.
- పట్టాదారు పాసుపుస్తం ఉండాలి
- పోటీ చేయడానికి ఓటు హక్కు కలిగిన ఓ రైతు బలపరచాలి
- ఒక రైతుకు ఎన్ని డబ్ల్యూయూఏల పరిధిలో ఆయకట్టు భూములు, ఓటు హక్కు కలిగి ఉన్నాప్పటికీ ఒక టీసీ సభ్యుడిగానే పోటీకి అర్హుడు. అలాగే ఒకేచోట మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

డిసెంబరులో తుఫానుల గండం

● దెబ్బతినిపోయిన వివిధ పంటలు ● ఆందోళనలో రైతులు

ప్రతి ఏడాది డిసెంబరు నెల వచ్చిందంటే రైతులు ఆందోళనకు గురవుతారు. గత మూడేళ్లుగా ప్రతి ఏడాది ఈ నెలలో తుఫాన్ బారిన పడి పంట నష్టపోయారు. ఈ ఏడాది ఫెంగల్ తుఫాన్ కారణంగా ఈ డిసెంబరు నెలలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండురోజులపాటు రాయలసీమలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- గోనెగండ

ఫెంగల్ తుఫాన్ వల్ల పత్తి పంట నాశనం అయింది. పత్తి కాయ నుంచి మొలకలు వచ్చాయి. దీనికి తోడు పత్తి రంగుమారిపోయింది. ఎమ్మిగ నూరు, మంత్రాలయం నియోజకవర్గాలలో పత్తి పంట దాదాపు 10వేల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 5 కోట్లు మేర పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నది.

పూత రాలిన కంది.. తగ్గిన దిగుబడి:

తుఫాన్ కారణంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలతోపాటు కర్నూలు జల్లాలోని చాలా ప్రాంతాలలో కంది పంట దెబ్బతిన్నది. ముసురు వల్ల కందిపంటకు పట్టిన పూత రాలిపోయింది. దీంతో మళ్లీ పూత వస్తుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో దాదాపు 6000 ఎకరాలలో కంది సాగు చేశారు. వర్షం కారణంగా నల్లరేగడి, పొలంలో నీటి నిలువ కారణంగా పంట దెబ్బతిన్నది. రెండోసారి పూత వచ్చినప్పటికీ దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.



తుఫాన్‌కు దెబ్బతిన్న ఉల్లి పంట

వర్షానికి తడిసిన వరిపంట:

డిసెంబరు నెలలో వరి కోతలు ఉంటాయి. అయితే ఈ నెలలో తుఫాన్ కారణంగా ఈ ఏడాది వరి పంట బాగా దెబ్బతిన్నది. గాజులదిన్నె ప్రాజెక్టు కింద హంద్రీ పరిసరాలలో ఈ ప్రాంతంతో వరి ఎక్కువగా సాగు చేస్తారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా వరి రంగు మారిపోయింది. గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం మండలాలలో 5000 ఎకరాలలో సాగు చేసిన వరి పంట తుఫాన్ కారణంగా దాదాపు రూ. 2 కోట్ల మేర నష్టం జరిగింది.

ఆసరాగా పంటల బీమా:

అకాలవర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం పంట బీమాను ప్రకటించింది. ఈ నెల 15వ తేదీలోపు పంటల బీమా చెల్లించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలలో దాదాపు 5000 మంది రైతులకు పంటనష్టం జరిగినట్లు తెలుస్తున్నది.



పూత రాలిపోతున్న కంది పంట

యునాని మెడికల్ కాలేజీలో పీజీ సీట్లు పెంచండి

- ఆస్పత్రి అభివృద్ధికి నిధులు ఇవ్వాలి
- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
- పార్లమెంట్‌లో గళం వినిపించిన ఎంపీ
- సానుకూలంగా స్పందించిన మంత్రి

కర్నూలు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని డాక్టర్ అబ్దుల్ హక్ యునాని మెడికల్ కళాశాలకు ప్రస్తుతం 50 మెడికల్ సీట్లే ఉన్నాయని, వాటిని పెంచాలని, పీజీ కోర్సు చేసేందుకు వీలుగా సీట్లు కేటాయించాని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్‌లో ఇదే అంశంపై గళమెత్తారు. సంప్రదాయ వైద్యం యునానిపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో 46 శాతం, పట్టణ ప్రాంతాల్లో 54 శాతం యునాని వైద్యం పొందుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని యునాని మెడికల్ కాలేజీ అభివృద్ధిలో భాగంగా పీజీ సీట్లు కేటాయించాలని కోరారు. సంబంధిత శాఖ మంత్రి స్పందిస్తూ ఈ విషయం పరిశీలిస్తామని పార్లమెంట్‌లో స్పష్టమైన హామీ ఇచ్చారు.



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

వెయిట్ లిఫ్టింగ్‌లో మేటి



యువగళం పాదయాత్రలో వెంకటలక్ష్మిని అభినందిస్తున్న నారా లోకేశ్ (ఫైల్)

- జాతీయ స్థాయికి చేరుకున్న వెంకటలక్ష్మి
- పసిడి పథకం సాధించిన క్రీడాకారిణి

ఆస్పరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వెంకటలక్ష్మి మారుమూల గ్రామంలో పుట్టారు. రెండేళ్లకే తండ్రి చనిపోయారు. జీవితం పొడవునా అవాంతరాలే. ముందుండి నడిపించేవారు లేరు. అయినా ఆమె ఇక్కడా ఆగిపోలేదు. ఆమె పట్టుదల గొప్పది. పవర్ వెయిట్ లిఫ్టింగ్ 59వ విభాగంలో పసిడి పథకం సాధించారు. మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి విజేతగా గుర్తింపుపొందారు. వీరభద్రి, నరసమ్మ దంపతుల ముగ్గురు కుమార్తెల్లో వెంకటలక్ష్మి రెండో సంతానం. ప్రాథమిక విద్య గ్రామంలోనే. ఇంటర్, వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో ఆసక్తి కనపరుస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించారు. 2022లో విశాఖపట్నంలో నేషనల్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ 59కేటగిరిలో బంగారు పతకాన్ని సాధించారు. తండ్రి లేకపోయినా ఆత్మస్థైర్యంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని పవర్ వెయిట్ లిఫ్టింగ్‌లో గుర్తింపు తెచ్చుకున్నారు. జిల్లా స్థాయి అధికారుల చేత అవార్డులు అందుకున్నారు. కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకొని అక్క చెల్లెళ్లకు వివాహాలు చేశారు. కుటుంబ ఆర్థిక స్థితి బాగా లేకపోవడంతో డిల్లీ నుంచి పిలుపు వచ్చినా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోయారు. ప్రస్తుతం బెంగుళూరులో పార్ట్ టైం ఉద్యోగం చేసుకుంటూ బీపీడీ కోర్సు చదువుతున్నారు. గత ఏడాది యువగళం పాదయాత్ర కైరుప్పల గ్రామం మీదుగా వెళ్లిన ప్రస్తుత ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేత అభినందనలు కూడా అందుకున్నారు.





కర్నూలులో వెంకటలక్ష్మిని అభినందిస్తున్న పోలీసు అధికారులు

● ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తాం

క్రీడలు, స్పోర్ట్స్‌పై ఉన్న ఆసక్తి నన్ను జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తాను..

- వెంకటలక్ష్మి జాతీయ క్రీడాకారిణి

ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదు

• వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

• ధర్నా చౌక్ నుంచి రైతులతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేకంగా తయారైన కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఎస్వీ మోహన్‌రెడ్డి అధ్వర్యంలో శుక్రవారం స్థానిక గౌరీ గోపాల్ ఆసుపత్రి నుంచి రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు వైసీపీ భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. మద్దతు ధరల లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ కడప రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీ డాక్టర్ బి.రామగిడ్డయ్య శుక్రవారం జోనల్ పరిధిలో 29 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్లుగా ఎన్.ప్రవీణ (కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసు), వై.కార్తీక్ (నంద్యాల జిల్లా జిల్లెల పీహెచ్‌సీ), పి.అరుంధతి (నంద్యాల డీఎంహెచ్‌వో కార్యాలయం), ఆర్.నాగేశ్వరి (కర్నూలు ఆర్టీసీ మేల్), పదోన్నతి పొందారు. 15 రోజుల్లో కొత్తగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆర్‌డీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉనికి కోసమే జగన్ తపన

• రైతుల పేరుతో ధర్నాలు చేయడం సిగ్గు చేటు

• నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉనికిని కాపాడుకొనేందుకు మాజీ సీఎం జగన్ రైతుల పేరుతో ధర్నాలు చేయడం సిగ్గు చేటు అని టీడీపీ నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ రైతు వ్యతిరేక విధానాలతో సంక్షోభం తలెత్తిందన్నారు. రైతు భరోసా పేరుతో ఏడాదికి దశలవారిగా రూ.7,500 మాత్రమే ఇచ్చి.. అంతకు ముందు ఉన్న పథకాలు, సబ్సిడీలను నిలిపివేసిందని అన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం ముందు ఉందని అన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతామని చెప్పి కేవలం 677 కుటుంబాలకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ విధానం వల్ల ఒక్కో రైతు కుటుంబంపై సగటున రూ.2.50 లక్షల అప్పు ఉందన్నారు. కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పి మోసగించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు రుణమాఫీ చేశామని ఏడు లక్షల మందికి గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. రబీలో పంటల బీమా చెల్లించకుండా రైతులను జగన్ ముంచారన్నారు. వైసీపీ నాయకులు రైతుల కోసం ర్యాలీ చేస్తుంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

ఎకో సెన్సిటివ్ జోన్‌గా రోళ్లపాడు

• 2017 నాటి నోటిఫికేషన్ సవరణకు కేంద్రం నిర్ణయం

• కలెక్టరు ఎక్స్ అఫిషియో చైర్మన్‌గా మానిటరింగ్ కమిటీ





కర్నూలు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా మిడుతూరు మండలంలోని రోళ్లపాడు వన్యప్రాణుల అభయారణ్యంను ఎకో సెన్సిటివ్ జోన్‌గా కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ 2017 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ప్రజాప్రయోజనాలు దృష్ట్యా నోటిఫికేషన్ సవరించాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కర్నూలు జిల్లా కలెక్టర్‌ను ఎక్స్ అఫిషియో చైర్మన్‌గా మానిటరింగ్ కమిటీని కేంద్ర పర్యావరణ శాఖ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో పర్యావరణ రంగంలో సేవలు అందించే ప్రభుత్వేతర సంస్థ ప్రతినిధి ఒకరు సభ్యుడిగా ఉంటారు. అయితే ఈ సభ్యుడిని రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లకోసారి నామినేట్ చేస్తుంది ప్రముఖ సంస్థ, రాష్ట్ర విశ్వవిద్యాలయంలో జీవావరణ శాస్త్రం లేదా పర్యావరణ రంగ నిపుణుడు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా రాష్ట్ర జీవ-వైవిధ్య బోర్డు కార్యదర్శి లేదా సభ్యుడు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, సీనియర్ టౌన్ ప్లానర్ లేదా చీఫ్ అర్బన్ ప్లానర్/సిటీ ప్లానర్, ఎక్స్ అఫిషియో మెంబరు సెక్రెటరీగా అటవీ శాఖ అభయారణ్యం బాధ్యతలు చూసే డిప్యూటీ కన్జర్వేటర్ కమిటీలో సభ్యులుగా ఉంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే జిల్లా పునర్విభజన తరువాత రోళ్లపాడు నంద్యాల జిల్లా పరిధిలోకి వెళ్లింది. ఆ జిల్లా కలెక్టర్ ఈ కమిటీకి చైర్మన్‌గా ఉండే అవకాశం లేకపోలేదు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కురువ రంగముని (ఫైల్)

గోనెగండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని కురువ వీధిలో శుక్రవారం మధ్యాహ్నం అప్పుల బాధ తాళలేక రంగముని (40)అనే రైతు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రంగ మునికి నాలుగు ఎకరాల భూమి ఉంది. దీనికితోడు గోనెగండ్లలోని ఇతర రైతుల వద్ద మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తు న్నారు. అయితే ఇటీవల వరుసగా వ్యవసాయంలో రంగమునికి నష్టం వచ్చింది. పెట్టుబడులు కూడా చేతికి వచ్చేవి కావు. దీంతో ఏటా అప్పు లు పెరిగిపోయాయి. ఈ ఏడాది ఎనిమిది ఎకరాల్లో మిరప, నాలుగు ఎకరాల్లో ఉల్లి, మరో నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంటలు సాగు చేశాడు. మిరప పంటకు వైరస్ సోకడంతో పంట పూర్తిగా దెబ్బ తిన్నది. ఉల్లి, వేరుశనగ పంటలు సరిగా పండలేదు. మూడేళ్లుగా చేసిన అప్పులకు ఈ ఏడాది అప్పులు, వడ్డీలు కలసి దాదాపు రూ.15 లక్షల వరకు రుణగ్రస్తుడయ్యాడు. ఇంత అప్పు ఎలా తీర్చాలో తెలియక మనోవ్యథకు గురయ్యాడు. శుక్రవారం రంగముని ఎమ్మిగనూరులో వేరుశనగ పంటను అమ్మేందుకు వెళ్లాడు. అయితే అక్కడ పంటకు గిట్టుబాటు ధర పలకకపోవడంతో ఇక చేసిన అప్పులకు వడ్డి కూడా కట్టలేనని భయపడ్డాడు. ఈ మనోవ్యథతో ఇంటికి తిరిగి వచ్చాడు.ఆ సమయంలో భార్య నాగమ్మ, పెద్దకుమారుడు లోకేష్ పొలం పనులకు వెళ్లారు. కూతురు రంగవేణి కిరాణం దుకాణానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పు దూలానికి రంగముని ఉరేసు కున్నాడు. దుకాణం నుంచి ఇంటి వచ్చిన కూతురు ఈ దృశ్యం చూసి కేకలు వేసి ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వారు వచ్చి రంగమునిని గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రంగముని మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య నాగమ్మ, కుమారుడు లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు న్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు

పిల్లలకు పోషకాహారం అందించాలి

• ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యతో పాటు ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ అన్నారు. పోషణ బి-పడాయిబి కింద 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషకాహారంతోపాటు చదువుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. శుక్రవారం స్టేట్ లెవెల్ ట్రైనింగ్ సెంటర్ మహిళ ప్రాంగణంలో సీడీపీవో సూపర్‌వైజర్ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ పీడీ ప్రారంభించారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషకాహారం, చదువు, 0-3 సంవత్సరాల పిల్లలకు నవ మాడ్యూల్ ద్వారా, ఈసీసీఈ ద్వారా ఫిజికల్, అభివృద్ధికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 4 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు అసెస్మెంట్ ద్వారా పిల్లల్లో ఏ స్థాయిలో ఉన్నారో తెలుస్తుందన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారం పిల్లలకు అందిస్తే వారు చదువుకుంటారనీ, అలాగే ఏకాగ్రత, చురుకుగా ఉంటారన్నారు. ఈ శిక్షణలో ఎన్ఐపీసీసీడీ రీజనల్ సెంటర్ బెంగుళూరు ప్రతినిధులు, సీడీపీవో, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దొంగతనం చేస్తే చర్యలు



నిందితుల వివరాల వెల్లడిస్తున్న సీఐ హనుమంతనాయక్

సంజామల, డిసెంబరు 13: దొంగతనాలకు పాల్పడితే చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ హెచ్చరించారు. శుక్రవారం రూ. 3 లక్షల విలువ చేసే విద్యుత్ కేబుల్‌ను దొంగించిన నిందితులను ఎస్ఐ రమణయ్యతో కలిసి ఆయన అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నట్లకొత్తూరు నుండి కమలాపురి వరకు విద్యుత్ సరఫరా చేసే 40 స్తంభాల విద్యుత్ వైర్లను మురళి, చంద్రుడు, పాండురంగడు అనే వ్యక్తులు దొంగిలించారని తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసున్నామని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 3లక్షలు విలువ చేసే విద్యుత్ వైర్లను స్వాధీనపరుచుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కంది రైతులకు పండుగే

• ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ ధరకు కందుల కొనుగోళ్లు

• కర్నూలులో 67 మెట్రిక్ టన్నులు, నంద్యాలలో 50 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు సన్నాహాలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం కంది రైతులకు కలిసొచ్చింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందుల ధర రూ.9,900 పలుకుతోంది. దీనికి మరో రూ.100 కలిపి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. కర్నూలు జిల్లాలో 50 వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 43వేల హెక్టార్లలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో కంది పంట సాగైంది. ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా కందిబేడలను తెల్లకార్డు ఉన్న వినియోగదారులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం చక్కెర, రాగులే ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం కందిబేడలను కూడా తెల్లకార్డుపై ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందుల ధర రూ.9,900 దాకా ఉంది. ఈ ధరకు మించి క్వింటంపై రూ. 50 నుంచి రూ. 100 దాకా అధికమైనా రైతుల నుంచే కొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కంది రైతులకు మంచి ఆదాయాలు వచ్చే అవకాశం ఉంది.


• రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ: నంద్యాల జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథరెడ్డి:

మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి కందులు కొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండు జిల్లాల్లో కలిపి దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల దాకా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఇటీవల జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిర్ణయమైంది. గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో కందుల విక్రయానికి రైతులు తమ పేర్లను చేయించుకుంటున్నారు.

• వ్యాపారుల అక్రమాలకు చెక్ పెడితేనే న్యాయం

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం రైతుల నుంచి పెద్ద ఎత్తున కందులను కొనాలని నిర్ణయం తీసుకోవడం సంతోషించదగ్గ విషయం. అయితే.. రైతులతో వ్యాపారులు తక్కువ ధరకు కందులను కొని వాటిని మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి బహిరంగ మార్కెట్‌లో అందిస్తున్న ధరకు అమ్ముకుంటున్నారు. దీని వల్ల రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేకపోగా వ్యాపారులే అధికంగా లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం దీనిపై చెక్ పెట్టాలి.



డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

ప్రియురాలు పట్టించుకోవడం లేదని...

• కొలిమిగుండ్లలో విషాదం



శ్రీహర్ష (ఫైల్)

కొలిమిగుండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి పట్టించుకోవడం లేదని, మాట్లాడటం ఆపేసిందని మథనపడిన ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొలిమిగుండ్ల మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కొలిమిగుండ్లకు చెందిన ఉపాధ్యాయురాలు శ్రీదేవి, మద్దిరెడ్డి జనార్దన్ దంపతుల పెద్ద కుమారుడు మద్దిరెడ్డి శ్రీహర్ష(20) గుజరాత్ రాష్ట్రంలోని పారుల్ యూనివర్సిటీలో బీబీఏ(డిగ్రీ) మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే అదే కాలేజీలో మరో కోర్సు చదువుతున్న అమ్మాయితో సన్నిహితంగా ఉంటూ ప్రేమించాడు. అయితే ఇటీవల కొద్ది రోజులుగా ఆ అమ్మాయి శ్రీహర్షతో మాట్లాడకుండా దూరం పెట్టింది. దీంతో యువకుడు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కళాశాలలో మనోవేదనకు గురై అనారోగ్యం బారిన పడ్డాడు. తోటి స్నేహితుల ద్వారా సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు పది రోజుల క్రితం గుజరాత్‌కు వెళ్లి కుమారుడిని ఇంటికి తీసుకొచ్చి వైద్యులతో చికిత్సలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తల్లి శ్రీదేవి వృత్తిరీత్యా స్కూల్‌కు వెళ్లగా, తండ్రి జనార్దన్ బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుమారుడి భవిష్యతు బాగుండాలని కాంక్షించిన తల్లిదండ్రులకు శ్రీహర్ష ఆత్మహత్య కడుపుకోతను మిగిల్చింది. చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచి, లక్షలు ఖర్చు చేసి ఉన్నతమైన విద్యా సంస్థలో చేర్పిస్తే.. ఇలా చేశావా? అంటూ రోదించిన తల్లిదండ్రుల ఆవేదన అందరినీ కలచివేసింది.

దగా పడ్డ మిర్చి రైతు

(5వ పేజీ తరువాయి)

కర్నూలు మార్కెట్ యార్డులో మిర్చి రైతుల్ని వ్యాపారులు అధికారుల అండ చూసుకుని నిండా ముంచుతున్నారు. తూకం వేయాల్సిన సమయంలో సంబంధిత సూపర్‌వైజర్, ఇతర అధికారులు అక్కడ ఉండాల్సింది పోయి.. కార్యాలయాల్లో సేద తీర్చుకుంటున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి రైతులు ఎన్నోసార్లు తీసుకువచ్చినా చలనం లేకపోవడం దారుణం. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపించింది. తాను తెచ్చిన ఎండుమిర్చి బస్తాలను కాటా వేస్తే దాదాపు 5 నుంచి 10 శాతం మిర్చిని తూకాల్లో చూపకుండా వ్యాపారి స్వాహా చేశాడని ఓ రైతు ఆరోపించాడు. రైతులదంతా ఇదే పరిస్థితి. ఇంత తక్కువ తూకం వేయడం ఏమిటని వ్యాపారులను రైతులు నిలదీశారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, తరుగు కింద ఈ మొత్తాన్ని తీసుకుంటున్నామని, ఇష్టం ఉంటే అమ్మండి.. లేకపోతే వెళ్లిపోమని వ్యాపారులు దమాయించడంతో రైతులు మిన్నకుండిపోయారు. తూకం వద్ద సూపర్‌వైజర్లు, ఆ పై అధికారులు ఉంటే ఈ పరిస్థితి తమకు ఎదురయ్యేది కాదని, ఎన్నోసార్లు సూపర్‌వైజర్, పై అధికారులకు చెప్పినా వ్యాపారులకే వారు వత్తాసు పలకడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

• కార్యాలయాల్లో ముచ్చట్లకే పరిమితం:

కర్నూలు మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లను సూపర్‌వైజర్లు పర్యవేక్షించడం ఆనవాయితీ. అయితే.. సంబంధిత సూపర్‌వైజర్ వారంలో కనీసం ఒక్క రోజు కూడా మిర్చి యార్డులో నిఘా పెట్టిన పాపాన పోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. తూకాల వద్ద వ్యాపారుల అక్రమాలను నిరోధించామని, ఖచ్చితంగా కాటాల వద్ద తూకాలు పూర్తయ్యే వరకు ఉండాలని సిబ్బందిని ఆదేశించామని పై అధికారులు అంటున్నారు. అయితే.. సంబంధిత సూపర్‌వైజర్ మిర్చి యార్డులో ఉండకుండా కార్యాలయంలోకి వ్యాపారులను పిలిపించుకుని ముచ్చట్లు పెడుతుండుతున్నాడని, ఇదేమి దారుణమంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూకాలు సాధారణంగా మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో సూపర్‌వైజర్ కనీసం పది నిమిషాలు కూడా మిర్చి యార్డులో ఉండకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.



కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన ఎండు మిర్చి

• కమీషన్ ఎక్కువ వసూళ్లు చేస్తున్నారు

- చంద్రన్న, పోలకల్, సీ. బెళగల్ మండలం

26 మిర్చి బస్తాలను అమ్మకానికి తెచ్చాను ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. కేవలం 4 బస్తాలకే దిగుబడి పరిమితమైంది. రెండున్నర ఎకరాలకు 1.80 లక్షల ఖర్చు వచ్చింది. నల్లి, తామర తదితర తెగుళ్ల కీటకాల వల్ల దిగుబడి దారుణంగా పడిపోయింది. కనీసం యార్డులో గిట్టుబాటు ధర అందుతుందోనని నమ్మకం పెట్టుకున్నాను. అయితే 4 శాతం కమిషన్ వ్యాపారులు ముక్కు పిండి వసూలు చేశారు. తక్కువ తూకంతో భారీగా నష్టపోయాను. కాటా యంత్రం వద్ద ఏ అధికారి రాకపోవడం మరింత నష్టానికి దారి తీసింది.

• ఇంత దారుణం గుంటూరు యార్డులో లేదు

- మల్లికార్జున, రైతు

మమ్మల్ని వ్యాపారులు దారుణంగా ముంచేస్తున్నారు. యార్డులో లక్షల్లో జీతభత్యాలు తీసుకుంటున్న సూపర్‌వైజర్, అధికారులు మా గోడు వినిపించుకోవడం లేదు. కార్యాలయాల్లో వారు వ్యాపారులతో మాట్లాడుకుంటూ కూచున్నారు. తక్కువ తూకాలతో నిండా మునుగుతున్నాము. కమిషన్ కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో దిక్కు తోచడం లేదు.

• వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం

-జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

మిర్చి యార్డులో మిర్చిని తూకం వేసే సమయంలో ఖచ్చితంగా సూపర్‌వైజర్లు, సెక్రటరీలు నిఘా పెట్టాల్సిందే. ఈ మేరకు వారికి ఆదేశాలు కూడా ఇచ్చాము. ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా సంబంధిత సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటాము. వ్యాపారుల లైసెన్సులను సస్పెన్షన్ చేస్తాము.

సాగునీటి సంఘాల ఎన్నికలు నేడే

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం చెరువు

ఆత్మకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో శనివారం జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 8 సాగునీటి వినియోగ సంఘాలు (డబ్ల్యూయూఏ)కు సంబంధించి 4129 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో ప్రధానంగా వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌కు అనుసంధానంగా ఉన్న వీఆర్‌ఎస్పీ-1 (కురుకుంద) పరిధిలో 647 మంది, వీఆర్‌ఎస్పీ-2 (వడ్లరామాపురం, ఆత్మకూరు, ఇందిరేశ్వరం)లో 873 మంది, వీఆర్‌ఎస్పీ-3 (వడ్లరామాపురం, ఇందిరేశ్వరం)లో 902 మంది, వీఆర్‌ఎస్పీ-4 (కురుకుంద)లో 1024 మంది, బైర్లూటిలోని గోసాయికట్ట చెరువు పరిధిలో 56 మంది, కరివేనలో 115 మంది, ఇందిరేశ్వరం గ్రామంలోని పద్మరాజచెరువు పరిధిలో 431, అమలాపురంలో అనువాగు చెరువు పరిధిలో 81 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా ఈ ఎన్నికలకు సంబంధించి శనివారం ఉదయం 8 నుంచి 9గంటల వరకు నామినేషన్లను దాఖలు చేస్తారు. ఎన్నికల అనివార్యమైనట్లయితే రహస్య ఓటింగ్ పద్ధతి ద్వారా 9 నుంచి 12 గంటల వరకు ఎన్నికలు జరిపి ఆ తర్వాత ఫలితాలను వెల్లడిస్తారు. కాగా మండలంలో దాదాపు అన్ని చోట్ల ఏకగ్రీవమయ్యే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ మద్దతుదారులు మాత్రమే నీటితీరువా పన్నులు చెల్లించి పోటీకి సిద్ధమైనట్లు సమాచారం.

మొత్తం 72 టీసీలకు ఎన్నికలు

ఆత్మకూరు మండలంలో శనివారం మొత్తం 8 చెరువులకు సంబంధించి 72 టీసీ (భూ భాగం నియోజకవర్గం)లకు ఎన్నికలు నిర్వహించనున్నాయి. ఇందులో వీఆర్‌ఎస్పీ పరిధిలోని నాలుగు చెరువులకు ఒక్కోదానికి 12 టీసీలు, అమలాపురం, కరివేన, ఇందిరేశ్వరం, బైర్లూటి చెరువులకు ఒక్కోదానికి 12 టీసీలకు ఎన్నికలకు జరగనున్నాయి. ఆయా డీసీలకు ఎన్నికలు జరిగి సభ్యులు ఎన్నికైన తర్వాత వారు ఆయా సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఇదిలా ఉంటే వరదరాజ స్వామి ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 7 సాగునీటి సంఘాలు ఉండగా అందులో నాలుగు ఆత్మకూరు, మూడు కొత్తపల్లి మండలంలో ఉన్నాయి. ఆయా సంఘాల అధ్యక్షులు ఎన్నికైన తర్వాత 19వ తేదిన రెండు మండలాలకు చెందిన సాగునీటి సంఘాల అధ్యక్షులు ప్రాజెక్ట్ కమిటీని ఎన్నుకుంటారు. ఈ చెరువులకు సంబంధించిన ఎన్నికలను మైనర్ ఇరిగేషన్ ఏఈ మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సాగునీటి సంఘం ఎన్నికలు తెలుగుగంగ పథకం పరిధిలో జరగనున్నాయి.

మిడుతూరు: మండలంలోని తలముడిపి, జలకనూరు, చింతలపల్లి గ్రామాల్లో నిర్వహించనున్న నీటి సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథ రామయ్య, ఇరిగేషన్ డీఈ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ బూతుల అధికారులతో సమావేశం నిర్వహించారు బూత్ లెవెల్ అధికారులకు నామినేషన్ ప్రక్రియపై అధికారులు వివరించారు. అనంతరం పోలింగ్ సామాగ్రిని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సురేష్, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్ కుమార్, ఈవోఆర్డీ సంజన్న పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల చెరువుల కింద శనివారం నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఉమారాణి, మండల మైనర్ ఇరిగేషన్ ఏఈ గౌతమ్ తెలిపారు. శుక్రవారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పా ట్లుపై సమీక్షించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని శివభాష్యం ప్రాజెక్టు కింద 3 డబ్ల్యూయూఏలు ఉండగా.. అందులో ఒక్కొక్కదానికి 12 టీసీల చొప్పున మొత్తం 36 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే శివపురం ఈర్లచెరువు కింద 6 టీసీలకు, మొండికట్ట చెరువు కింద 6 టీసీలకు, మల్లమ్మ చెరువు కింద 6 టీసీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సాగునీటి ఎన్నికలకు 3,480 మంది పురుష రైతు ఓటర్లు ఉండగా.. మహిళా రైతు ఓటర్లు 1218 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలు కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్, గువ్వలకుంట్ల ఎంపీయూపీ పాఠశాల, గోకవరం జిల్లా పరిషత్ హై స్కూల్, శివపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆ చెరువుల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జూపాడుబంగ్లా: మండలంలోని చిన్ననీటిపారుదలశాఖ పరిధిలో ఉన్న 4 చెరువులకు, కేసీ కాలువ కింద 12 టీసీల పరిధిలో శనివారం సాగునీటి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. మండ్లెం చెరువుకు సంబంధించి 6 టీసీలకు మండల పరిషత్తు పాఠశాల, తంగడంచలో 6 టీసీలకు స్థానిక ఎంపీపీ పాఠశాల, పారుమంచాల చెరువుకు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, అదే గ్రామంలో వీరాపురం చెరువవుకు ఎంపీపీ పాఠశాలలో, కేసీ కాలువ కింద ఉన్న 12 టీసీలకు జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ ఎన్నికల్లో అధికార పార్టీలోనే ఎమ్మెల్యే, ఎంపీ వర్గానికి చెందిన వారే పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. 4 చెరువుల కింద 962 ఓట్లు ఉండగా, కేసీ కాలువ కింద 12 టీసీలకింద 2297 ఓట్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

మహానంది: మహానంది మండలంలో శనివారం నాలుగు సాగు నీటి చెరువులకు అధ్యక్ష, ఉపాధ్యాక్షుడి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు శుక్రవారం తెలిపారు. ఇందులో గోపవరం బైరవాణి చెరువు, తమ్మడపల్లి ఇంజవాణి చెరువు, గాజులపల్లి అంకిరెడ్డి చెరువు, బసవాపురం చెరువులకు నీటి వినియోగదారుల సంఘాలకు ఒక్కొక్క చెరువుకు ఆరు ప్రాదేశిక నియోజికవర్గ వర్గా ప్రతినిధులకు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. వీటితో పాటు తెలుగుగంగ ప్రాజెక్ట్‌కు సంభందించిన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే అన్ని సాగునీటి సంఘాల అధ్యక్షుల ఏకగ్రీవమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



మిడుతూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై సమావేశమైన అధికారులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ

నంద్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్, పీజీ కళాశాలలో శుక్రవారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు వక్తృత్వ, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, నోడల్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్ పాల్గొన్నారు.

'సచివాలయ ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలి'

కొత్తపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఈరగార్ల రాజు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొత్తపల్లికి చెందిన తప్పెటి నాగరాజు, లలితమ్మ దంపతుల రెండో కుమారుడైన తప్పెట అరుణ్ కుమార్ (25) అనే సచివాలయ ఉద్యోగి ఆత్మకూరులోని ఎస్‌పీజీ పాలెంలోని 1వ సచివాలయంలో విధులు నిర్వహిస్తూ ఇటీవలే డిప్యుటేషన్‌పై కర్నూలులోని కుడా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆ సమయంలో అస్వస్థతకు గురైన అరుణ్ కుమార్‌ను కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారన్నారు. ప్రభుత్వం కుటుంబంలోని ఒకరికి ఉద్యోగంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

'మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి'

గడివేముల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం చేసే ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మానసిక వ్యాధుల వైద్యురాలు సింధూజ అన్నారు. మండలంలోని జిందాల్ పరిశ్రమలో శుక్రవారం జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ యూనిట్ హెడ్ నవనీత్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు శాంతిరామ్ హాస్పిటల్ వైద్య బృందం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. జిందాల్ పరిశ్రమ సిబ్బంది, శాంతిరామ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యుల సమస్యలపై పోరాటం'

నంద్యాల కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సమస్యలపై పోరాడతామని రాష్ట్ర శ్రీపొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్నికైన సేగు ఉపేంద్ర అన్నారు. శుక్రవారం నంద్యాలలో జిల్లా అధ్యక్షుడిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఉపేంద్రను ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు. శేగు ఉపేంద్ర సమితి వ్యవస్థాపకుడు గుడివాడ వేణు గోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాండురంగయ్య, సుధాకర్, భద్రశెట్టిరవి, అమరేష్, సురేష్, భరత్‌కుమార, శివానంద్, కిరణ్ పాల్గొన్నారు.

'జయప్రదం చేయాలి'



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకుడు, విద్యార్థినులు

పాణ్యం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే, ఫాతిమా షేక్‌ల జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రతాప్ పిలుపునిచ్చారు. శుక్రవారం మోడల్ పాఠశాల వద్ద పూలే, ఫాతిమా జయంతి వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

'బీసీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చడం సరికాదు'

ఆత్మకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీ జాబితాలో ఇతర కులాలను చేర్చాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలు చేయడం సరికాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలాస్వామి యాదవ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, వీరన్న అన్నారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రిజర్వేషన్ కోటా పెంచిన తర్వాతే ఇతర కులాలను బీసీలో చేర్చాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

'జాతీయ స్థాయిలో రాణించాలి'



చెస్ విజేతలకు మెమెంటోలు అందిస్తున్న నటుడు సాయికిరణ్

నంద్యాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి చెస్ పోటీల్లో రాణించాలని సినీ, టీవీ నటుడు సాయికిరణ్ అన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండ్రోజులుగా నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డా. రవికృష్ణ అధ్యక్షతన విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. సినీ నటుడు సాయికిరణ్, ఆయన సతీమణి స్రవంతి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా. రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మెడల్స్, మెమెంటోలను విజేతలకు అందించారు. రాష్ట్ర, జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, ఆర్బిటర్లు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం సరికాదు: సీపీఎం





జూపాడుబంగ్లాలో, సింగరాజుపల్లిలో విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

జూపాడుబంగ్లా, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి కుటుంబాలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జూపాడుబంగ్లాలో శుక్రవారం వారు ధర్నా చేపట్టారు. జాతీయ రహదారిపై విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ట్రూ అప్ చార్జీల సర్దుబాటు పేరుతో భారం మోపడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్ణ, రాము, నరసింహ, శివ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై భారం వేయడం ప్రభుత్వం మానుకోవాలని సీపీఎం మండల నాయకులు నక్క స్వాములు, దాసు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా మండలంలోని సింగరాజుపల్లిలో నిరసన తెలిపారు. విద్యుత్ చార్జీల బిల్లుల ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవకుమార్, రాజు, బాబు, ఫక్కీరయ్య, పెతూరు, నరసింహులు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో నిధులు దుర్వినియోగం

- రూ.65,230 రికవరీకి.. ఆరు పనులపై విచారణకు పీడీ ఆదేశం
- తనిఖీ అధికారులతో వాగ్వాదానికి దిగిన సిబ్బంది



అధికారులతో వాగ్వాదం చేస్తున్న సిబ్బంది

వెలుగోడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలో జరిగిన ఉపాధి పనులలో రూ.65,230 దుర్వినియోగం అయ్యాయని, వాటిని రికవరీ చేయాలని పీడీ జనార్దన్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 6.25 కోట్లతో జరిగిన పనులపై 18వ విడత సామాజిక తనిఖీలపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆయా గ్రామాల వారిగా నివేదికలను చదివి వినిపించారు. అబ్దుల్లాపురం గ్రామంలో రూ.9,851, బోయరేవుల గ్రామంలో రూ. 1,484, మాధవరం గ్రామంలో రూ. 4,638, మోతుకూరు గ్రామంలో రూ.7,872, వేల్పనూరులో రూ.1,455, రేగడగూడూరులో రూ.930, వెలుగోడులో రూ.39,000 దుర్వినియోగం అయినట్లు అధికారులు తేల్చారు.

వెలుగోడు పట్టణంలో మరో ఆరు పనుల్లో భారీగా నిధులు దుర్వినియోగం అయినట్లు తనిఖీ బృందం చెప్పగా సిబ్బంది వారితో వాగ్వాదానికి దిగారు. ప్రతిదీ భూతద్దం పెట్టి రికవరీకి ఆదేశిస్తే తాము ఆత్మహత్యలు చేసుకోవాల్సిందేనని ఆగ్రహించారు. దీంతో ఆరు వర్క్ ఐడీలపై త్రిసభ్య కమిటీతో విచారణ చేయాల్సిందిగా పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో డీవీవో బాలాజీ నాయక్, ఏవీవో సీబారాణి, ఏపీడీ అన్వరా బేగం, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీవో మల్లికార్జున, సీఆర్పీలు, డీఆర్పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

'భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు'

ఆత్మకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తరలివచ్చి తహసీల్దార్ రత్నరాధికకు అర్జీల రూపంలో సమస్యలను విన్నవించుకున్నారు. డీటీ ఆంజనేయులు, సబ్ రిజిస్ట్రార్, దేవాదాయశాఖ సిబ్బంది ఆదిలక్ష్మీ, నారాయణ తదితరులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: రెవెన్యూ గ్రామసభల్లో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. తాటిపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు గ్రామసర్పంచ్ లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన 4 ఫిర్యాదులను స్వీకరించామని చెప్పారు. డీటీ నాగన్న, సత్యదీప్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మన్నగౌడు, శ్రీనివాసగౌడు, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు రైతులు కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి: ముసలిమడుగు గ్రామ సచివాలయ ఆవరణంలో స్థానిక సర్పంచ్ జమీలాబీ అధ్యక్షతన వీఆర్వో రామసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కేవలం ఐదుగురు రైతులు అధికారులకు అర్జీలు ఇచ్చారు. తహసీల్దార్ ఉమారాణి, మండల సర్వేయర్ అనూషారాణి, వీఆర్వోలు మౌలాలి, లింగస్వామి, నాయకులు రామకృష్ణారెడ్డి, రహీంఖాన్ తదితరులు ఉన్నారు.

పాణ్యం: రెవెన్యూ సదస్సులో రైతుల జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్)లను పరిష్కరించినట్లు పాణ్యం తహశీల్దారు నరేంద్రనాథ రెడ్డి తెలిపారు. శుక్రవారం అలమూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పంటరుణాలు, ఈక్రాప్, రిజిస్ట్రేషన్‌ల సమస్య రైతులకు తీరిందన్నారు. శుక్రవారం ఒక్కరోజే ఏడు జాయింట్ ఎల్‌పీఎంలు పరిష్కరించామన్నారు. సర్పంచ్ మనోహర్, ఆర్ఐ రాము, సబ్ రిజిస్ట్రార్ నరేంద్రనాథ్‌రాజు, మండల సర్వేయర్, నాగరాజు, మాజీ ఎంపీటీసీ రామగోవిందరెడ్డి, వీఆర్వో పద్మావతి, పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కట్టుదిట్టంగా రాత్రి పహారా'

నంద్యాల క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రాత్రి పహారా కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. గత 24గంటల్లో నిర్వహించిన విజిబుల్ పోలీసింగ్‌లో వాహన తనిఖీలు, నిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, మద్యం, ఇసుక, గంజాయి ఇతర మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరగకుండా చూసేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకుగాను నిరంతరం విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. రాత్రి పహారాలో భాగంగా ప్రతిరోజూ సిబ్బంది వారి స్టేషన్ పరిధిలోని నేరచరిత్ర గలవారు, అనుమానితులపై, రాత్రిళ్లు అనవసరంగా రోడ్లపై తిరిగేవారిపై దృష్టి సారిస్తూ అనుమానితుల వేలిముద్రలు తీసుకొని రాత్రిపూట దొంగతనాలు, అల్లర్లు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్ధరాత్రి దాటాక జాతీయ, రాష్ట్ర రహదార్లపై వెళ్తున్న వాహనాలను ఆపి డ్రైవర్లకు ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గడచిన 24 గంటల్లో డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని 441 మందిని గుర్తించి రూ.2,29,375 జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిసిన 21మందిని గుర్తించి 21 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై 75 కేసులు నమోదు చేయడంతో పాటు బహిరంగ ధూమపానం చేస్తున్న వారిపై 67కేసులు నమోదుచేసి రూ.5270 జరిమానా విధించినట్లు వివరించారు. కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న కేసులో 13మందిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.15,250స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డోన్ సబ్ డివిజన్ పరిధిలో ఎస్.రాచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా ఆడుతున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి అతడివద్ద నుంచి రూ.3,300స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రెండు నాటుసారా కేసుల్లో ఇద్దరిని అరెస్ట్‌చేసి వారి నుంచి 10మద్యం బాటిళ్లతోపాటు 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో పూలతో అలంకరించిన పల్లకిపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు చేశారు. వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు నౌడూరి నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.


'విలేకరులపై దాడులను అరికట్టాలి'

పాణ్యం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో విలేకరి, కెమెరామన్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, దాడులను అరికట్టాలని విలేకరులు కోరారు. డిప్యూటీ తహసీల్దారు శివశంకర్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు చిన్న బాలకంబయ్య, రమేష్, శ్రీనివాసులు, నబి, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు
- శిథిలావస్థకు చేరడంతో ఆందోళనలో ప్రయాణికులు

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు బస్టాండు పైకప్పు పెచ్చులూడి ప్రమాదానికి నిలయంగా మారింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతోందనని ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బస్సుల కోసం వేచి ఉంటున్నారు. బస్టాండ్ పైకప్పు పెచ్చులూడి కడ్డీలు వేలాడుతున్నాయి. బస్టాండ్ పైకప్పు బీములు కూడా పెచ్చులూడి తుప్పు పట్టి పోయిన కడ్డీలు బయటికే దర్శనమిస్తున్నాయి. అలాగే బస్టాండ్ ముఖ ద్వారం కూడా ఇరువైపులా పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్నాయి. వీటిని చూస్తుంటేనే భయం కలుగుతోంది. బస్టాండ్ గోడలు, పైకప్పు బీటలు బారి కనిపిస్తున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందో అన్న భయంతో ప్రయాణికులు భయపడుతున్నారు. 1986లో నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. దీనిని పూర్తిగా తొలగించి పునర్నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్ పైకప్పునకు తూతూ మంత్రంగా సిమెంట్ పూత పూసి చేతులు దులుపుకొంటు న్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆర్టీసీ డిపో మేనేజర్ నాగరాజును వివరణ కోరగా.. దీనికి సంబంధించిన సివిల్ ఇంజనీరు అధికారులు పరిశీలించి వెళ్లారని తెలిపారు. పెచ్చులూడిన చోట సిమెంట్ పూత వేస్తారని చెప్పారు. పైకప్పు ప్రమాదవశాత్తు కూలిపోతే ఎలా అని అడిగితే అదంతా తనకు తెలియదని, ఇంజనీర్లను అడగాలని సమాధానమిచ్చారు.



బస్టాండ్ పైకప్పు పెచ్చులూడి కడ్డీలు వేలాడుతున్న దృశ్యం



పెచ్చులూడిన పైకప్పు



ముఖద్వారం దుస్థితి

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



పట్టణంలోని పాతబస్టాండులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బేతంచెర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంపుదలను వెంటనే ఉపసంహరించుకోవాలని బేతంచెర్ల సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఎల్లయ్య, మండల కార్యదర్శి మధుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండులో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ కరెంటు బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మధుశేఖర్, నాయకులు బి.రామాంజనేయులు, ఎస్.రామ చంద్రుడు, ఎం.భాస్కర్, స్వామి నాయుడు, రాజబాబు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, చిన్న నాగరాజు, టింగు, ఓబులేసు, మహేశ్వరరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి భూమా శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి ఆయన మ్యాచ్‌ను ప్రారంభించారు. అమ్మా నాన్నలకు క్రీడలంటే చాలా ఇష్టమని.. అందుకే ఏటా క్రీడా కారులను ప్రోత్సహించేందుకు క్రికెట్, టెన్నిస్ పోటీలు నిర్వహిస్తూ బహుమతులు అందజేస్తున్నట్లు విఖ్యాత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో బనగానపల్లె వాసికి మొదటి ర్యాంక్



డాక్టర్ సాయినాథ్‌రెడ్డి

బనగానపల్లె , డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ నిర్వహించిన ఐఎన్ఐఎస్ఎస్‌లో బనగానపల్లె వాసి డాక్టర్ సాయినాథ్ రెడ్డి మొదటి ర్యాంక్ సాధించారు. శుక్రవారం పలువురు పట్టణ వాసులు డాక్టర్ సాయినాథ్‌రెడ్డిని అభినందించారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఎండి పూర్తి చేసి పిడియాట్రిక్ నియోటాలజీ లో డీఎం కోర్సులో చేరడానికి ఈ పరీక్ష రాసి జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసేవల్లో ఉన్నత ప్రమాణాలు అందించి భారతదేశ వైద్య రంగాన్ని ప్రపంచ అగ్ర స్థాయికి తీసుకు వెళ్లడమే లక్ష్యమని తెలిపారు.

అహోబిలంలో తిరునక్షత్ర తిరుమంజనం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో తిరుమాంగై ఆళ్వార్ తిరునక్షత్ర తిరుమంజనం వేడుకలను అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేశారు. మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి

డోన్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయంలో స్వామి వారి జయంతి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పురోహితులు షేషావలి శర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలి

శిరివెళ్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని.. అందులో ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం శివాలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సామూహిక కుంకుమార్చనతో శుక్రవారం ముగిశాయి. కార్యక్రమంలో అర్చకుడు పలుకూరు కిరణ్ కుమార్‌శర్మ, వెలిగొండారెడ్డి, కందుల మల్లీశ్వరి, వెంకటలక్ష్మి, రాజేశ్వరి, నర్సమ్మ, సరస్వతమ్మ పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీసేవ

బనగానపల్లె , డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొ క్కులు తీర్చుకున్నారు.

నేడు కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాయినిపల్లె రహదారిలో వెలసిన కాశిరెడ్డి నాయన ఆలయంలో శనివారం ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేరం బయ్యపురెడ్డి, నందకిశోర్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోవెలకుంట్ల: కోవెంకట్ల మంలంలోని కలుగొట్ల గ్రామంలో శనివారం కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

కొలిమిగుండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో కాలుష్యాన్ని నియంత్రిచడం కోసం మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, పర్యావరణ శాఖ అధికారి మురళీ కృష్ణ అన్నారు. శుక్రవారం రామ్‌కో పరిశ్రమ ఆవరణంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, అడ్మిన్ హెడ్ రామరాజు, ఏవీపీ సూర్యకాంత్, సీనీయర్ జీఎం రవికుమార్, అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌కో ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణం

కొలిమిగుండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. రామ్‌కో సిమెంట్ పరిశ్రమ గ్రామాలయ సంస్థ ఆధ్వర్యంలో ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.50వేలు వెచ్చించి నిర్మిస్తున్నట్లు రామ్‌కో అధికారులు చంద్రశేఖరరావు, బ్రమేష్, భరత్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నాయకులు మూల శివారెడ్డి, సర్పంచ్ సుంకమ్మ పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ వ్రతం

చాగలమర్రి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం హనుమాన్ వ్రతం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ధర్మకర్త శివప్రసాద్ అంజనేయస్వామి పతాకాన్ని ఆవిష్కరించారు. వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, జల, క్షీరాభిషేకాలు, కలశ స్థాపన పూజలు చేశారు. మహిళలు సామూహికంగా హనుమాన్ వ్రతం చేపట్టారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదారులు రవికుమార్ ఆధ్వర్యంలో పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



బేతంచెర్ల పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు



చాగలమర్రిలో వీరాంజనేయస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం 108సార్లు పూదోట మటం రామిరెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. లోక కల్యాణార్థం హనుమద్ వ్రతం, హనుమాన్ చాలీసా పారాయణం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రైతులకు రుణాలు ఇచ్చి, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీలో అందించిన ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమే అని తెలిపారు. రైతులకు ఏ సమస్య వచ్చినా రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని, తక్షణమే రైతుల పొలాలకు చెందిన సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజల నుంచి భూసంబందిత సమస్యలపై వినతులు స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జడ్పీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డోన్ ఆర్డీవో నరసింహులు, మండల తహసీల్దార్ ప్రకాష్‌బాబు, రెవెన్యూ ప్రత్యే అధికారిని బషీరున్నీసా బేగం, టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, తిరుమలేష్ చౌదరి, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర నాయక్, మాధవ కృష్ణ, గ్రామ నాయకులు పిల్లి అశ్వత్, మాజీ సర్పంచ్ వెంకట్రాముడు, అర్జున్, రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్ రూరల్: రైతుల భూసమస్యలు పరిష్కరించేందు కోసమే ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని డోన్ తహసీల్దార్ నాగమణి అన్నారు. మండలంలోని ఉడుములపాడు గ్రామ సచివాలయం ప్రదేశంలో గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి తహసీల్దార్ అర్జీలను స్వీకరించారు.

చాగలమర్రి: గ్రామాల్లో రైతుల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గొట్లూరు గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ మద్దిలేటి, ఆర్ఐ అబ్దుల్ సత్తార్, టీడీపీ నాయకుడు జమాల్‌రెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, వీఆర్వో శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

కోవెలకుంట్ల: ప్రతి దరఖాస్తును పరిశీలించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని భీమునిపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, సర్వేయర్ వీరన్న, వీఆర్వో నాగమద్దిలేటి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీటీ చంద్ర శేఖరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చందలూరులో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 27 మంది రైతులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వీఆర్వో చంద్ర మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలం చెల్లిన పానీయాల విక్రయం సరికాదు



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన శీతల పానీయాలు విక్రయించడం సరికాదని సీపీఐ నాయకులు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో డోన్ పట్టణంలోని కేవీఎస్ కాలనీలోని స్మార్ట్ బజారు షాపింగ్ మాల్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ తక్కువ రేటు పేరుతో కాలం చెల్లిన శీతలపానీయాలను ప్రజలకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్న మాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొద్ది రోజుల నుంచి తక్కువ రేటుతో జరుగుతున్న ఈ వ్యాపారంపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆలస్యంగా స్పందించడం దారుణమన్నారు. తనిఖీలు చేసి శీతల పానియాలు మాత్రమే సీజ్ చేసి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. మండల రెవెన్యూ అధికారి (ఆర్ఐ) ఆందోళన కార్యక్రమం వద్దకు వచ్చి షాపింగ్ మాల్‌ను సీజ్ చేస్తున్నట్లు తెలపడంతో సీపీఐ నాయకులు ఆందోళన సద్దుమనిగింది. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మోటరాముడు, అనుబంధ సంఘాల నాయకులు నారాయణ రామ్మోహన్, అబ్బాస్, సూర్యప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

దొర్నిపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని అధికారులు, సర్పంచ్‌లు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో సావిత్రి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ భవనంలో ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు ఉన్నారు.

కొలిమిగుండ్ల : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొమ్మిది అంశాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శుక్రవారం రెండో రోజు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు అవగాహన కల్పించారు.

రుద్రవరం: రుద్రవరం మండల పరిషత్ సమావేశ భవనంలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిసినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మీ అన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొలిమిగుండ్ల ఎంపీడీవో ప్రసాదరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో వరప్రసాదరావు, ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు ఆధ్వర్యంలో సుస్థిరత అభివృద్ధి లక్ష్యంపై నిర్వహించిన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసిన జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి

బనగానపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో నిరోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఐశ్వర్యారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా విధులు నిర్వహించాలని మంత్రి సూచించారు.



మంత్రికి బొకేను ఇచ్చిన జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఐశ్వర్యారెడ్డి

పురాతన బావిలో పూడికతీత

కొలిమిగుండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పురాతన బావిలో పూడికతీత పనులను సర్పంచ్ జినుగు శివరాముడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు బావిలో పూడిక తీయిస్తున్నట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

కొలిమిగుండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పప్పు శనగ సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని ఏవో భూమా జ్యోతి వెల్లడించారు. శుక్రవారం మండలంలోని బి.ఉప్పలూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని ఏవో నిర్వహించారు. ఈ సందర్భంగా శనగ సాగులో తీసుకోవాల్సిన మెళుకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఘనంగా తిరుచ్చి సేవ

బేతంచెర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో శుక్రవారం ఘనంగా తిరుచ్చి సేవా నిర్వహించారు. పురోహితులు ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఇచ్చి మహా మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిలో ఏర్పాటు చేసి ఏవో రామాంజనేయులు సమక్షంలో ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు



రుద్రవరం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న తహసీల్దారు

చాగలమర్రి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు ఎన్నికలు శనివారం నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. చాగలమర్రి మండలంలోని 11 సాగునీటి సంఘాలు, 108 టీసీలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందిని నియమించామన్నారు. 11 మంది పీవోలు, 11 మంది ఏపీవోలను ఏర్పాటు చేశామని అన్నారు. ముత్యాలపాడు, చింతలచెరువు, డి.వనిపెంట చెరువుల కింద 1,014 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కేసీ కెనాల్ పరిధిలో 2, టీజీపీ పరిధిలో 6 సంఘాలు ఉన్నాయని అన్నారు. 108 ప్రా దేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రుద్రవరం: మండలంలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు మల్లికార్జున రావు తెలిపారు. శుక్రవారం ఎన్నికల అధికారులకు ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు.

కొలిమిగుండ్ల: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కొలిమిగుండ్ల తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి కృషి చేయాలని సూచించారు.

కోవెలకుంట్ల: మండలంలోని ఆరు గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులను నియమించామన్నారు. ఒక గ్రామంలో 12 టీసీలు, ఎన్నికలు జరుగుతాయన్నారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు

\- ప్యాపిలి సీఐ వెంకటరామిరెడ్డి



ప్యాపిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సీఐ వెంకట రామిరెడ్డి తెలిపారు. పేకాట, మట్కా, నాటుసారాను అరికట్టేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మట్కా, పేకాట నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మట్కా బీటర్ల ఇళ్ల దగ్గర పోలీసు నిఘా ఉంచాం. మట్కా రాస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. అలాగే ప్రతి ఆదివారం పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నాం. సర్కిల్ సరిహద్దులో అనంతపురం జిల్లాకు చెందిన వారు పేకాట నిర్వహించేవారు. ఇప్పుడు సరిహద్దు ప్రాంతంలో కూడా పోలీసు నిఘా పెట్టాం. తద్వారా పేకాటను నియంత్రించాం.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: 44వ జాతీయ రహదారిపై ప్రమాద ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన సూచికలను ఏర్పాటు చేశాం. తరచూ పెట్రోలింగ్ నిర్వహించి అతివేగంతో వెళ్తున్న వాహనాలకు, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా విధిస్తున్నాం. అలాగే వాహనాల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: కొంత మంది పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలున్నాయి?

జవాబు: పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి తెస్తే ఊరుకొనే ప్రసక్తే లేదు. శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలతో ఫ్రెండ్లీగా వ్యవహరించాలని, అక్రమ వసూళ్లకు పాల్పడవద్దని పోలీసు సిబ్బందికి ఆదేశించాం.

ప్రశ్న: యువతకు ఎలాంటి సలహాలు ఇస్తారు?

జవాబు: యువకులు ఆన్‌లైన్ బెట్టింగులు, గేమ్‌కు దూరంగా ఉండాలి. మత్తుపదార్థాలు, చెడు వ్యసనాల వలన భవిష్యత్తు నాశనవుతుంది. వాటి జోలికి వెళ్లకుండా తమ వంతు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే వారిలో సామాజిక సేవా భావం కలిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ న్యాయస్థాన ప్రాంగణంలో శనివారం నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, న్యాయాధికారి ఆర్‌వీవీఎస్ మురళీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానంలో అపరిష్కృతంగా ఉన్న కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునే వెసులుబాటు ఉందన్నారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సంకల్ప్-2025 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్న సంకల్పంతో మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యబాబు, నవీన్‌పాటి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతంపై హర్షం



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె , డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నెహ్రూ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంపై టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బనగానపల్లె నెహ్రూస్కూల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో మొత్తం 35 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. 800మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కంపెనీలను ఒప్పించి జాబ్‌మేళాకు తీసుకువచ్చారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళా విజయవంతం చేయడానికి సహకరించిన అధికారులకు, సిబ్బందికి బీసీ ఇందిరమ్మ ధన్యవాదాలు తెలిపారు.

వరిపంట కోత ప్రయోగం

చాగలమర్రి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామంలో ఏవో రంగనేతాజీ ఆధ్వర్యంలో ఏఈవో మంజుల, ఇన్సూరెన్స్ అధికారి శంకర్, ఎంపీఈవో శ్రావణి ఆధ్వర్యంలో శుక్రవారం వరిపంట కోత ప్రయోగం చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొలతలు తీసి దిగుబడిని అంచనా వేశారు. వరి దిగుబడి అధికంగా వచ్చిందని ఏవో పేర్కొన్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాతబస్టాండులోగల ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ, రాఘవేంద్ర ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల శుక్రవారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. నాణ్యతగల భోజనం ఇవ్వాలని సూ చించారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మౌలాలి, సీఆర్పీ ఖాసీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై విచారణ

చాగలమర్రి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలో ఉపాధి పనులపై ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ పర్యవేక్షణలో శుక్రవారం సామాజిక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గోవిందయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. 65 పనులకు రూ.31.13 లక్షలు ఉపాధి నిధులు ఖర్చు అయినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ పరిధిలో రూ.4.85 లక్షలు నిధులతో రోడ్ల పనులు చేశామని అన్నారు. ఈ పనులపై సామాజిక బృందం విచారణ చేసి బహిరంగ సభలో నివేదికలు చదివి వినిపించారు. ఉపాధి పనుల్లో చేతివాటం ప్రదర్శించారని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఏపీవో నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ సంఘం మండల అధ్యక్షుడు మృతి

బనగానపల్లె , డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండల శ్రీకృష్ణదేవరాయ బలిజసంఘం అధ్యక్షుడు గోపిశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం (66)మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు మండల శ్రీకృష్ణదేవరాయ బలిజసంఘం, పట్టణ కమిటీ సభ్యులు సంతాపం తెలిపారు.